ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
ఆదివారం 28 సెప్టెంబరు 2025



కడప నగర శివారులోని నానాపల్లె, చలమారెడ్డిపల్లె పరిసరాల్లో జరుగుతున్న గ్రావెల్ దందా గుట్టు రట్టు కానుంది. ఇక్కడ జరుగుతున్న గ్రావెల్ దందాపై ఆంధ్రజ్యోతి శుక్రవారం 'కొల్లగుట్టారు' అనే కథనం ప్రచురించింది. కడపకు కూతవేటు దూరంలో జరుగుతున్న గ్రావెల్ దందాపై సవివరంగా ప్రచురితమైంది. ఇది అటు రాజకీయ ఇటు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సీరియస్‌గా స్పందించారు. గుట్టగుల్ల కావడం వెనుక ఉన్న గుట్టును రట్టు చేయాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్స్ బృందం సోమవారం నుంచి విచారణ నిర్వహించి అక్రమాల గుట్టును బహిర్గతం చేయనుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుట్ట గుల్లపై విజిలెన్స్

- విచారణకు కలెక్టర్ ఆదేశం
- రేపటి నుంచి రంగంలోకి విచారణ బృందం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులో ఉన్న నానాపల్లె, చలమారెడ్డిపల్లె సమీపంలోని కొండలో గ్రావెల్ తవ్వకం కొందరికి అక్షయపాత్రగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే కొందరు అటు ఇటు ఉంటూ లబ్ధి పొందుతూ గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. వైసీపీ హయాంలో అయితే అడ్డగోలుగా ఐదేళ్ల తవ్వేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు ప్రచురించింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నప్పటికీ ఇక్కడ సేమ్ టు సేమ్‌గా దందా సాగుతోంది. మొన్నటి వరకు ఒకే గూడు కింద తలదాచుకున్న గ్రావెల్ బ్యాచ్ మధ్య ఆధిపత్య పోరు ఏర్పడింది. దీంతో రెండు వర్గాలుగా విడిపోయారు. కాగా.. ఇక్కడ 8 రీచ్‌లకు అనుమతి ఉంటే ప్రస్తుతం రెండు రీచ్‌లలో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాలలో వైసీపీ, అధికారపార్టీ నేతలు భాగస్వాములుగా ఉన్నారంటారు. ఈ నేపథ్యంలో నాలుగురోజుల క్రితం నానాపల్లె వద్ద గ్రావెల్ తవ్వకాలు జరిగేచోట గొడవ జరిగింది. టిప్పర్, హిటాచీ అద్దాలను పగులకొట్టారు. ఇది పెద్ద సంచలనంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో ఇది పెద్ద ఇష్యూ అయింది. ఈ ఇష్యూ అమరావతి వరకు చేరడంతో విచారణకు ఆదేశించారు.

పేరు	సర్వేనెంబర్	లీజు స్థలం	గడువు
ఓ.బాలకొండయ్య	919/1పీ	3.998 హెక్టార్లు	13 ఆగస్టు 2030
ఎస్.యల్లారెడ్డి	919/1పీ	4.466 హెక్టార్లు	20 జూన్ 2030
సింగారెడ్డి శివమ్మ	919	4.628 హెక్టార్లు	23 నవంబరు 2032
సాయివినీల ఏజెన్సీ	919/1పీ	4.36 హెక్టార్లు	23 ఫిబ్రవరి 2032
ఎస్.రాధిక	919/1	4.864 హెక్టార్లు	4 మార్చి 2030
కె.రామక్రిష్ణారెడ్డి	919/1	2 ఎకరాలు	27 అక్టోబరు 2027
జి.చెన్నారెడ్డి	919/1పీ	1.762 హెక్టార్లు	జూన్ 9కి ముగిసింది

అనుమతులు వీటికే...

చిన్నచౌకు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 919/1పీలో గ్రావెల్ తవ్వకాలకు భూగర్భగనులశాఖ అనుమతి ఇస్తుంటుంది. ప్రస్తుతం అక్కడ 7 క్వారీలు ఉండగా వీటిలో ఒకదాని గడువు ముసిగిందని భూగర్భగనుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే జి.చెన్నారెడ్డి, ఓ.బాలకొండయ్యకు చెందిన మైన్స్ మాత్రమే లైవ్‌లో ఉన్నాయి. ఇవి కూడా వేరేవాళ్లు లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నారు. మిగతా లీజులన్నీ కొందరు పాత బకాయిలు, ఇతరత్రా పెనాల్టీ చెల్లించకపోవడం, మరికొందరు తమకు మైనింగ్ వద్దంటూ అధికారులకు లిఖితపూర్వకంగా తెలపడంతో ఇవన్నీ మనుగడలో లేవని సమాచారం.

రంగంలోకి విజిలెన్స్

గ్రావెల్ తవ్వకాల్లో జరిగిన అక్రమాలను గుర్తించేందుకు విజిలెన్స్ బృందం సోమవారం నుంచి రంగంలోకి దిగనుంది. మొత్తం అక్కడ ఎన్ని క్వారీలకు అనుమతినిచ్చారు..? ఎన్ని హెక్టార్లలో ఇచ్చారు? ఎంత పరిమాణంలో ఎన్ని క్యూబిక్ మీటర్లు తవ్వాల్సి ఉంది, ఎంత తవ్వారు? కేటాయించిన లీజులో తవ్వారా, లేక వేరేచోట తవ్వారా..? ఎన్ని క్యూబిక్ మీటర్లకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారు..? అనే వాటిపై సమగ్రంగా విచారించనుంది. అలాగే లీజులు ఇచ్చిన వారు ఎవరికైనా సబ్ లీజుకు ఇచ్చారా.. ఇచ్చి ఉంటే అగ్రిమెంటు జరిగిందా, దానిని రిజిస్టరు చేయించారా? లేక లిఖితపూర్వకంగా ఇచ్చారా? సబ్ లీజుకు ఇచ్చిన చోట తవ్వారా? తవ్వినందుకు గాను ఎన్ని క్యూబిక్ మీటర్లకు రాయల్టీ చెల్లించారు? అనే విషయాలపై విజిలెన్స్‌బృందం సమగ్రంగా విచారణ జరపనుంది.



చిన్నచౌకు రెవెన్యూ పరిధిలోని రెవెన్యూ కొండలో జగనన్న లేఅవుట్ పక్కనే లోయను తలపిస్తున్న తవ్వకాలు

అడ్డగోలుగా తవ్వకాలు

గ్రావెల్‌కు ఉన్న డిమాండ్‌ను కొందరు లీజుదారులు బాగా సొమ్ము చేసుకున్నారు. కేటాయించిన చోట కాకుండా పక్కన తవ్వి నిబంధనలు ఉల్లంఘించినట్లు చెబుతారు. అంతేకాకుండా రాయల్టీ చెల్లించకపోవడం, క్లోజ్ అయిన లీజుకు సంబంధించిన మాన్యువల్ రాయల్టీని అడ్డుపెట్టుకుని భారీగా తవ్వేశారనే ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై విజిలెన్స్ విచారణ జరపనుంది.

గండికోటలో స్వచ్ఛతాహీ



స్వచ్ఛతాహీలో భాగంగా గండికోటలో సేకరించిన వ్యర్థాలతో విద్యార్థులు, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేశ్‌కుమార్ తదితరులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం గండికోటలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులతో స్వచ్ఛతాహీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. అలాగే గండికోట పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి గ్రాండ్ కెన్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన గండికోట లోయ, గండికోట ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు గండికోట టూరిజం హోటల్ ఆవరణలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ మల్లికార్జునగౌడ్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కోట మృత్యుంజయరావుకు ఎక్సలెన్సీ అవార్డు



సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మృత్యుంజయరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావుకు ఆంధ్రప్రదేశ రాష్ట్ర పర్యాటక రంగ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ అవార్డు శనివారం సాయంత్రం అందుకున్నారు. పర్యాటక ప్రదేశాలు, ఆలయ శిల్పాలు, కుడ్య చిత్రాలు, హస్తకళలపై చేసిన పరిశోధన, టూరిజం అభివృద్ధికి చేసిన కృషికి ఈ అవార్డు అందజేశారు. విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ తదితరులు ఆయనను అభినందించారు.

తగ్గిన ధరలు దుకాణాల ముందు ప్రదర్శించాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): తగ్గించిన జీఎస్టీ మేరకు వస్తువుల ధరలను ప్రతి దుకాణం ముందు ప్రదర్శించాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుమతి వెల్లడించారు. శనివారం స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై వ్యాపార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తగ్గించిన జీఎస్టీ ఫలాలు ప్రజలకు వివరించాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. వివిధ రకాల వస్తువుల ధరలు తగ్గిన విషయం అక్టోబరు 19 వరకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీటీవో హనుమంతు, మండి మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షుడు రోషన్, వ్యాపార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వీరభద్రయ్య, ఆడిటర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వరదరాజులు, వస్త్రభారతి అధ్యక్షుడు ప్రసాద్, రీటైల్ క్లాత్ మర్చంట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత

- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం
- ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకోసం జిల్లా పోలీసుశాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. శనివారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా పోలీసుశాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల సభ్యులకు మహిళల భద్రత-డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ఖాకీ యూనిఫాం ప్రజల సేవ, రక్షణ కోసమే అన్నారు. పోలీసుశాఖ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు వెంటనే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయిపై గట్టి చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. సెల్ఫ్ హెల్ప్‌గ్రూపు మహిళలకు డ్రగ్స్, గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే వెంటనే పోలీసుశాఖ 1972 టోల్‌ఫ్రీ నెంబర్ లేదా వాట్సప్ 8977781972 నెంబర్లకు తెలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ అన్నిశాఖల అధికారుల సమన్వయంతో మరంత సమర్థవంతంగా సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జీఎస్టీలో సవరణల వల్ల వినియోగదారులకు ఎంతో మేలు చేకూరిందని, 99శాతం వస్తువులు, సేవలు పన్నురహితంగా మారాయన్నారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మెప్మా ద్వారా పేదరిక నిర్మూలనకు చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం ఎలైట్ యాంటి నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంటు (ఈగల్) ఆధ్వర్యంలో రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఎస్పీ, అదనపు ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, ఐసీడీఎస్ పీడీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీసీపీవో సుభాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రీల్స్ ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడాలి : ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాల వీడియోలకు ప్రాధాన్యత ఇవ్వాలని షెల్కే నచికేత్ విశ్వనాథ్ కోరారు. జిల్లాలో పోలీసు - సిటిజెన్ కో-ఆపరేషన్‌లో భాగంగా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు భాగస్వాములు కావాలని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఎస్పీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని 50 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరాలు, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో చైతన్యం తేవడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళలు, బాలికలు, న్యాయవ్యవస్థను కించపరిచేలా.. కులమతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా ఉన్న పోస్టులను గుర్తిస్తే వెంటనే kadapapolicesocialmedia@gmail.com లేదా వాట్సప్ 9121100686కు ఫిర్యాదు చేయాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- 340 టవర్లు ఏర్పాటు

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టెలికాంరంగ సంస్థ అయిన భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 4జీ సేవలను ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ శనివారం 4జీ సేవలను ప్రారంభించారు. దీంతో జిల్లాలో అధికారికంగా 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో టీసీఎస్ సహకారంతో 4జీ సేవలను రూపొందించారు. ఇదే టెక్నాలజీపై 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే విధంగా అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు. ఉమ్మడి కడప జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు 340 టవర్లు ఉన్నాయి. అవన్నీ ఇప్పుడు 4జీ టవర్స్‌గా మార్చారు. ప్రైవేటు కంపెనీలు రీచార్జ్‌లను విపరీతంగా పెంచేశాయి. అయితే బీఎస్ఎన్ఎల్ ధరలు పెంచకుండా తనకున్న 2జీ, 3జీ నెట్‌వర్క్‌ను 4జీగా మార్చుకుంటూ ప్రైవేటు కంపెనీలకు ధీటుగా మెరుగైన ప్రీపెయిడ్ ప్లాన్‌లను అమలు చేస్తోంది. నెట్‌వర్క్ మెరుగవడంతో ప్రైవేటు కంపెనీల నుంచి మొబైల్ వినియోగదారులు పోర్ట్ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మారుమూల ప్రాంతాలు, కొన్ని దర్శనీయకేంద్రాల్లో ప్రైవేటు టెలికాం సేవలు లేవు. ప్రైవేటు కంపెనీల సేవలు లేని 42చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేసి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది.



ఊరకే అంటే.. ఊరంతా..!



ఉల్లిగడ్డల కోసం ఎగబడ్డ ప్రజలు

రాజుపాలెం/దువ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉల్లి దిగుబడులకు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలం నుంచి వాటిని తీసేందుకు అయ్యే కూలి ఖర్చులు కూడా రావడం లేదని కన్నీరు పెడుతున్నారు. దువ్వూరు మండలం జిల్లేళ్లకు చెందిన వెంకటయ్య అనే రైతు కానగూడూరు వద్ద రెండెకరాల్లో ఉల్లి సాగుచేశాడు. వీటిని పొలం నుంచి తీసి మూడు రోజుల క్రితం జాతీయరహదారిపైన ఎండబెట్టారు. వాతావరణం అనుకూలించక పోవడంతో వీటిని కొనేందుకు ఎవరూ రాలేదు. మార్కెట్‌లో ధర కూడా తక్కువగా ఉంది. దీంతో రైతు శనివారం సాయంత్రం ఉచితంగా తీసుకెళ్లండని చెప్పారు. అంతే.. ఆ గ్రామంలోని ప్రజలు, రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఎగబడి మరీ మూటలకు ఎత్తుకుని పోయారు. రెండెకరాల్లో ఉల్లి సాగుచేసేందుకు రూ.1.20 లక్షలు ఖర్చయిందని.. ఉల్లిగడ్డలకు ధరలేక కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో రోడ్డుపై వదిలేయాల్సి వచ్చిందని రైతు వాపోయాడు.

కరుణించమ్మా.. కాత్యాయనీ..



కాత్యాయనీదేవి అలంకారంలో విజయదుర్గాదేవి



విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూ



కడప అమ్మవారిశాలలో త్రిపురసుందరీదేవి అలంకారం



కడప లలితా పంచాయతన దేవాలయంలో అరుణ సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్/ప్రొద్దుటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో శోభాయమానంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజైన శనివారం అమ్మవారం పలురూపాల్లో భక్తులను కరుణించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారిశాలవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో త్రిపురసుందరీదేవిగా, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో గాయత్రీదేవిగా, లలితా పంచాయన దేవాలయంలో అరుణ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరిదేవి దేవస్థానంలో మోహినీదేవిగా దర్శనమిచ్చారు. దేవునికడప లక్ష్మీవెంకటేశ్వరుని ఆలయంలో తిరుమలేశుడు ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు అమ్మవారిశాల, రాజరాజేశ్వరీదేవి ఆలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, శివాలయాల్లో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవి అలంకారం



దసరా ఉత్సవాల సందర్భంగా నృత్య ప్రదర్శన




మహారాష్ట్రమఠంలో గాయత్రీదేవి అలంకారం

ప్రైవేటుకు పంచాయతీ నిధులు

● వీధి దీపాల పేరుతో రూ.7.50 లక్షలు చెల్లింపు ● నాడు వైసీపీ నేత ఆదేశంతో రియల్ వ్యాపారికి లబ్ధి

సాధారణంగా ఎక్కడైనా పంచాయతీ అనుమతితో నిబంధనల మేరకు ప్రైవేటు వ్యక్తులు, రియల్ వ్యాపారులు లేఅవుట్ వేస్తే.. అక్కడ నివాసాలు ఉంటే విస్తరణలో భాగంగా వీధిలైట్ల ఏర్పాటుకు పంచాయతీ నిధులు వెచ్చించాలి. అది కూడా సింగిల్ వైరు (కండెక్టర్) మాత్రమే లాగాలి. కానీ బసినికొండ పంచాయతీలో వేసిన లేఅవుట్‌లలో ఆ స్థాయిలో నిర్మాణాలూ జరగలేదు. కాపురాలూ లేరు. అయినా సరే వైసీపీకి చెందిన రియల్ వ్యాపారి.. బిల్డర్ అయిన ఓ వ్యక్తి లబ్ధి చేకూర్చే క్రమంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఆదేశాలతో రూ.7.50లక్షల పంచాయతీ నిధులతో ఇక్కడ విద్యుత్ ఏర్పాటు చేశారు.

మదనపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డించే వాడు మనోడైతే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అనేలా.. ఇక్కడి అధికారులు వ్యవహరించారు. పంచాయతీలో మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు, శానిటేషన్ సక్రమంగా లేక ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోని పాలకులు, అధికారులు.. ప్రైవేటు లేవుట్‌లో మాత్రం నిధులు వెచ్చించారు. పన్నుల రూపంలో ప్రజలు పంచాయతీకి చెల్లించిన సొమ్మును వారి సంక్షేమం, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉండగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారి అభివృద్ధికి సహకరించి స్వామి భక్తిని చాటుకున్నారు. వందలు కాదు వేలు కాదు.. ఏకంగా లక్షల రూపాయలు వెచ్చించి విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేశారు.


బైపాస్‌రోడ్డు సాయిబాబాగుడి ఎదురుగా లేఅవుట్‌లో లాగిన విద్యుత్తు లైన్లు

మదనపల్లె మండలంలోని బసినికొండ పంచాయతీ పరిధిలో ఉన్న మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వైపీపీ పాలనలో లేఅవుట్‌లు వేశారు. వీటిని అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు, సన్నిహితుడు ఏర్పాటు వేశారు. ఇందులో బసినికొండ కస్పాలోని పంచాయతీ కార్యాలయం వెనుక వైపున (నిమ్మనపల్లె రోడ్డు నాలుగు కూడలి వద్ద) ఒకటి, బైపాస్ రోడ్డు సాయిబాబా గుడికి ఎదురుగా మరొక వెంచర్ వేశారు. అక్కడి ఒక లేవుట్‌లో ప్లాట్లు అమ్మిందీ లేదు. కస్టమర్లు కొన్నదీ లేదు. రియల్ వ్యాపారే బిల్డర్‌గా నివాసాలు, డూప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ఇందులో మదనపల్లె-నిమ్మనపల్లె ప్రధాన రహదారి నుంచి లేఅవుట్‌లోని నివాసాల చివరి వరకు త్రీఫేజ్‌లో విద్యుత్తు లైన్ వేశారు. ఇక్కడ తొమ్మిది విద్యుత్ స్తంభాలు, అయిదు వైర్ల చొప్పున కండెక్టర్ లాగారు. ఇందుకోసం బసినికొండ-1 పంచాయతీ నుంచి రూ.3.38 లక్షలు ట్రాన్స్‌కోకు 2023 డిసెంబరు 1వతేదీన చెల్లించారు. ఇక్కడ రెండు మూడు గృహాల్లో మాత్రమే నివాసాలు ఉండగా, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. నివాసం ఉన్నవి కూడా డూప్లెక్స్ సంపన్నులు ఉండేవి. ఇలాంటి లేవుట్‌లో వీధి దీపాల ఏర్పాటు పేరుతో పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్ములు అర్పించారు. సాయిబాబా గుడికి ఎదురుగా ఉన్న మరో వెంచర్‌లోనూ ఇలాగే చెల్లించారు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలు, త్రీఫేజ్ లైన్ కోసం రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇలా రెండు ఏరియాలలో రూ.7.50 లక్షలకుపైగా అత్త సొత్తు అల్లుడి దానం అన్నట్లు వెచ్చించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

బైపాస్‌రోడ్డు నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న ఈ లేఅవుట్ బసినికొండ-2 పరిధిలోకి వస్తుంది. కానీ బసినికొండ-1 నుంచి నిధులు వెచ్చించారు. అదీ వైసీపీలోని అడ్డదిడ్డ పాలన. వీరిని ఎవరూ అడిగే వారే లేరు. అడిగినా సమాధానం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వారి ఇష్టానుసారం చేసేశారు. ఎక్కడ అనుకూలమో, ఎక్కడ తాముకాలితో చెబితే, చేత్తో చేస్తారో అలాంటి వారి నుంచే చేయించారు. రియల్, బిల్డర్‌గా ఉంటున్న వైసీపీ నేతకు ఆర్థిక లబ్ధి చేకూర్చారు.

స్థానికుల ఆగ్రహం

బసినికొండ పంచాయతీ పట్టణ శివారు ప్రాంతంలో విస్తరించి, పట్టణంలో కలసిపోయింది. అయితే పట్టణ స్థాయిలో వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే, రియల్‌వ్యాపారి లేఅవుట్‌లో పంచాయతీ నిధులు ఖర్చు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా పంచాయతీలో కొత్తగా లేఅవుట్ వేస్తే, అక్కడి నుంచి పన్నులతో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలే కానీ.. నివాసాలు లేని చోట నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడం ఏంటనేది అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. దీనిపై డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పంచాయతీ నిధులు ప్రైవేటు లేఅవుట్‌లలో ఖర్చు చేయకూడదని అన్నారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



బసినికొండలోని రియల్ వ్యాపారి లేఅవుట్‌లో విద్యుత్తు లైన్ - రామాచార్లపల్లె సమీపంలోని లేవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ ఆలస్యంగా ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడుకొండలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం కూడా తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఈ మార్గంలో వారానికి రెండుసార్లు నడిచే ఏడుకొండలు రైలు ఈనెల 24వ తేదీ ఐదున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచిన విషయం విదితమే. ఈ రైలు శనివారం కూడా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఆలస్యంగా బయలుదేరింది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 6.26 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 9 గంటలకు వెళ్లింది.

గుంటూరు-ధర్మవరం మధ్య రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సత్యసాయిబాబా 100వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుంటూరు నుంచి ధర్మవరం, ధర్మవరం నుంచి గుంటూరుకు రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జంక్షన్ నుంచి ధర్మవరం జంక్షన్‌కు (రైలు నెంబర్ 17261) అక్టోబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడుస్తుంది. అలాగే ధర్మవరం జంక్షన్ నుంచి గుంటూరు జంక్షన్‌కు (రైలు నెంబర్ 17262) అక్టోబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మరో రైలు నడుస్తుంది. ఈ రెండు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరు జంక్షన్, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్ రోడ్, కంబం, గిద్దలూరు, నంద్యాల, బలనగనపల్లె, కోవెలకుంట, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె రోడ్, ములకలచెరువు, కదిరి, ధర్మవరం రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


నాగేంద్ర మృతదేహం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు నాగేంద్ర (37) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, కొండామారిపల్లె గ్రామంలోని తట్టివారిపల్లెకు చెందిన శేషయ్య కుమారుడు నాగేంద్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్లు తెలిపారు. కాగా ఉన్న ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికిలోని శవపరీక్ష గదికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం ... కేసు నమోదు


శ్రీకాంత్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యక్తి ఆదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ (58) శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బెంగళూరు రోడ్డు సమీపంలో హంద్రీ-నీవా కాలువ గట్టున స్కూటీ, చెప్పులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కాగా కాలువ, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికినా ఏమీ లభ్యం కాలేదని చెప్పారు. మృతుడికి భార్య గాయత్రి, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్


అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. వాహనాల యజమానికి జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

జాక్‌పాట్ విధానంపై ఏడీఎం విచారణ

గుర్రంకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై మార్కెట్ శాఖ ఏడీఎం త్యాగరాజు విచారణ చేపట్టారు. ఈనెల 2వ తేదీ రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు దద్దాల హరిప్రసాద్ నాయుడు జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏడీఎం శనివారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్లపై రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డులో టమోటా వేలం పరిశీలించారు. మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలు సరిగా లేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అమ్మయ్యా... దాహం తీరింది...


బాటిల్ మూత వచ్చింది... ఇలా తాగేద్దాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఎండ మండిపోతున్న వేళ ఓ వానరం వాటర్ బాటిల్‌లోని నీరు తాగి తన దాహార్తిని తీర్చుకుంది. కొత్తపేట వీధిలోని గ్రామీణ బ్యాంకు సమీపాన ఓ ఇంటర్నెట్ దుకాణంలోకి వెళ్లిన వానరం అక్కడ ఉన్న ఓ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లి గోడమీద కూర్చుని దాని మూతను తీసేందుకు నానా తంటాలు పడింది. ఎలాగోలా బాటిల్ మూతను తొలగించి అందులోని నీటితో దాహం తీర్చుకోవడమే కాక నీటిని ముఖంపై పోసుకుని ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందింది.

డీఎస్సీ నియామకంపై సంబరాలు



నాయకుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలు పూర్తయిన సందర్భంగా పీలేరులోని ఏపీసీపీఎస్ఈఏ, ఎన్‌టీఏ నేతలు శనివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే విజయవంతంగా డీఎస్సీ నిర్వహించి, దాదాపు 16 వేల మందికి నియామకపత్రాలు అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

రాష్ట్రంలోని ఉద్యోగులందరూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్న డీఏలపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక అందించేలోపు మధ్యంతర భృతిని ప్రకటించాలని, తద్వారా ఉద్యోగులు దసరా, దీపావళి పండుగలను సంతోషంగా చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అమరనాథ్, మస్తాన్, సుబ్రహ్మణ్యం, ధర్మయ్య, శివశంకర్, జనార్దన్‌రెడ్డి, జయరాం, వేణుగోపాల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణితో పాటు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల మండల స్థాయి సిబ్బందితో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, విద్య, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలతో తదితర అంశాలపై కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలు 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరులను తనిఖీ చేయాలన్నారు. ట్యాంకులపై సరైన కవర్లు ఉండాలని లేకుంటే పక్షులు, ఎలుకలు, చెత్త వంటి పదార్థాలు నీటిలో పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకులు శుభ్రపరచే పనులు రెగ్యులర్‌గా చేయాలన్నారు. ఈ వారం చివరికల్లా అన్ని ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారలు కలిసి నివేదిక ఇవ్వాలని, పైప్‌లైన్‌లు ఎక్కడా డ్రైనేజ్ పక్కన లేకుండా ట్యాంకులకు మూత ఉండాలన్నారు.

పశువుల వ్యాధుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మండల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుండుపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్, సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి పోటీలకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పుల్లంపేటలో జరిగిన సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్ల ఎంపికల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు అభి, బాలికల విభాగంలో సంధ్య రాష్ట్ర పరిశీలకుల దృష్టిని ఆకర్షించారు. సీనియర్ మెన్ విభాగంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కార్తీక్, ఆంజనేయులు జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు. సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబరు 4, 5, 6 తేదీల్లో శ్రీకాకుళంలో, సీనియర్ మెన్ పోటీలు నవంబరులో గుంటూరులో జరుగుతాయి.

ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో 8 మంది ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో రిషిత్, నితీష్, ప్రతాప్, బాలికల విభాగంలో అఖిల, పుష్పలత, సుశాంతి, కార్తీక, తన్విక అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ నీలకంఠ రావు, ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు.


40 ఏళ్లుగా నిరీక్షణ

- జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాలకు ఇంకెన్నాళ్లు....?
- ఏక్ సాల్ పర్మిషన్లతో ప్రభుత్వ లబ్ధికి దూరం
- సంబేపల్లె తప్ప అన్ని మండలాల్లో పట్టాలు పంపిణీ
- కూటమి ప్రభుత్వంపైనే దళిత రైతుల ఆశలు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాల కోసం 5, 10, 15 ఏళ్లు కాదు ఏకంగా 40 సంవత్సరాలుగా దళిత రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం సర్వే నెంబర్-430లో 110 ఎకరాలు, మోటకట్ల గ్రామం సర్వే నెంబర్-831లో 159 ఎకరాలు పొలం జెడ్‌హెచ్‌డీసీ కింద ఉంది. ఈ భూముల్లో పంటలు పండించేది రైతులు. దానిపై పెత్తనం మాత్రం జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులది. ఈ భూములకు సంబంధించి ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 154 మంది దళిత రైతులు పట్టాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. 1985 నుంచి ప్రతి యేటా ఏడాదికి 75 రూపాయలు రుసుం చెల్లించి రైతులకు ఏక్ సాల్ పర్మిషన్‌తో పొలాలు సాగు చేసుకుంటున్నారు. పంటసాగు చేసి రైతుల పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి రైతులకు మాత్రం రావడం లేదు. రైతులకు పట్టాలు లేవు, పాస్‌బుక్కులు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు రావడం లేదు. నష్టం వచ్చినా, కష్టం వచ్చినా ఫలితం మాత్రం రైతులకు దక్కడం లేదు. ఏళ్ల తరబడి దళిత రైతుల నిరీక్షణ తప్పడం లేదు.

ఆ భూములపై 2015 నుంచి అధికారుల ప్రతిపాదనలు

జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి పట్టాల కోసం శివవెంకటస్వామి ఫిర్యాదు మేరకు 2015లో చీఫ్ సెక్రటరీ అప్పటి జిల్లా కలెక్టర్‌కు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అయితే పట్టాలు అప్పట్లో ఇవ్వలేదు. 2017లో అప్పటి కడప ఉమ్మడి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ జిల్లాలో 13 మండలాలకు సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయని, 1538 మంది రైతులకు సంబంధించి 2906.74 ఎకరాలు సంబంధించి పట్టాల కోసం ప్రతిపాదలను సిద్ధం చేసి పంపారు. అయితే జిల్లాలో సంబేపల్లె తప్ప మిగిలిన అన్ని మండలాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములను దళిత రైతులకు పట్టాలు అందజేశారు. ఇప్పటికీ సంబేపల్లెకు చెందిన రైతులు మాత్రం పట్టాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. సంబేపల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, ఖాజీపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, నందలూరు, అట్లూరు, గోపవరం, పోరుమామిళ్ల, మైదుకూరులలో జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయి.



2015లో చీఫ్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు

కాలువకు పోయిన జెడ్‌హెచ్‌డీసీ భూములు

సంబేపల్లె మండలానికి సంబంధించి జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో 2017లో మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ సబ్ కెనాల్ కాలువలకు ఈ భూములు పోయాయి. జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ వారికి పరిహారం కింద 54 లక్షల 58 వేల 104 రూపాయల పరిహారం మంజూరు అయినట్లు ఉత్తర్వులు పంపారు. దీనికి సంబంధించిన డబ్బులు మాత్రం రైతులకు అందలేదు. ఈ భూములకు సంబంధించి కొలతలు వేసి సర్వేలు చేసి ఫైలు సిద్ధం చేశారు. పట్టాలు మాత్రం రాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా దళిత రైతుల పట్టాలు అందించాలని కోరారు.

సంబేపల్లె మండలంలోని జెడ్‌హెచ్‌డీసీ భూమి



భూములపై హక్కు కల్పించాలి



40 ఏళ్లుగా ఈ భూములపై పోరాటం చేస్తున్నా. ఇప్పటికైనా ఈ భూములపై హక్కు కల్పించాలి. పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు ఏమీ అందడం లేదు. పర్మిషన్ పేరుతో మా గొంతు కోస్తున్నారు. ఇప్పటికైనా విముక్తి కల్పించాలి. పట్టాలు ఇచ్చి పుణ్యం కట్టుకోవాలి.

- శివవెంకటస్వామి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



భూములకు కొలతలు వేశారు. ఫైలు సిద్ధం చేశారు. అయినా పట్టా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని ఉన్నాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు పొందాలంటే పట్టా, పాసుబుక్కు ఉండాలి. ఇవి కల్పించి సాయం చేసి ఆదుకోవాలి.

- సుబ్బన్న, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

పోషణ మాసం... ఆరోగ్యమే లక్ష్యం

జిల్లాలో అంగన్వాడీల కార్యక్రమం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రకరకాల సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు బాలింతలు తగిన జాగ్రత్తలు వహిస్తే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. రక్తహీనత, బలం లేకపోవడం వల్ల కొంత వరకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అదే విధంగా నీరసం, వంటి సమస్యలతో వయసుతో సంబంధం లేకుండా అనేక మంది బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్త్రీశిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవం 2025ను నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న 2212 మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో 177 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 11,267 మంది గర్భిణులు, 12,821 మంది బాలింతలు 56,340 మంది 3 నుంచి 6 సంవత్సరాల్లో పిల్లలకు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.



సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

నెల రోజుల్లో కార్యక్రమాలు

అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో బలాన్నిచ్చే వంటకాల తయారీ, తక్కువ ధరకు లభించే పండ్ల పోషణ విలువలు వివరిస్తున్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు బరికెలు తదితర తృణధాన్యాలతో వంటకాలు ఎలా తయారు చేయాలో మహిళలకు కార్యకర్తలు వివరిస్తున్నారు. పోషకాహార తయారీపై పోటీలు నిర్వహించడం జరుగుతోంది. అదే సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాల ప్రాధాన్యత అనుబంధ ఆహారంపై వివరిస్తున్నారు. కథలు, బొమ్మల ద్వారా తల్లి దండ్రులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆహారం వండేటప్పుడు పోషకాలు నష్టపోకుండా తగిన మోతాదులో ఎలా తయారు చేయాలో చేసి చూపించడం జరుగుతోంది. అంగన్వాడీ కేంద్రాల్లో గ్రామల్లోని బహిరంగ ప్రదేశాల్లో న్యూట్రిషన్లతో పోషకాహారం చేయించి ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. వయసుల వారీగా చిన్నారులు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలో సూచిస్తున్నారు. స్థూలకాయ నివారణకు చక్కెర, నూనె వినియోగం ఏ విధంగా వాడాలో వివరిస్తున్నారు. తల్లుల ఆధర్యంలో పోషణపై ప్రతిజ్ఞ, పిల్లలకు అపార్ ఆబా ఐడీల నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

పోషకాహారం పక్కాగా నిర్వహించేందుకు చర్యలు



పోషకాహార మాసోత్సవాలను అన్ని అంగ న్వాడీ కేంద్రాల్లో పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోషకాహారంపై ప్రదర్శనలు నిర్వహించి తల్లులకు అర్థమ య్యేలా చెప్పాలని సిబ్బందికి సూచించాం. కార్యక్రమం అక్టోబరు 16 వరకు నిర్వహిం చడం జరుగుతుంది.

-రమాదేవి, పీడీ, ఐసీడీఎస్



కమలాపురంలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శన (ఫైల్)

గండికోట, రాజోలి సమస్యలు పరిష్కరించాలి

● మరోసారి అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే ఆది

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) గండికోట ప్రాజెక్టు, రాజోలి ఆనకట్ట సమస్యలను పరిష్కరించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శనివారం మరోసారి అసెంబ్లీలో గళం విప్పారు. ఈ రెండిటిపైనా ఈనెల 19న అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, తిరిగి వాటి గురించి అసెంబ్లీలో లేవనెత్తారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు అందాల్సిన రూ.460 కోట్ల పరిహారం గురించి మంత్రి నిమ్మల రామనాయుడు, నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్‌తో కలిసి ఎన్నిసార్లు అడిగినా సమస్య అడుగునే ఉందని, ఆర్థికశాఖ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సభదృష్టికి తీసుకెళ్లారు. కుందూనదిపై రాజోలి ఆనకట్టను మూడు టీఎంసీలతో నిర్మించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ జీవో ఇచ్చారన్నారు. దీనివల్ల రైతులు భూములు అమ్మ కుండా, కొనుకుండా బ్లాక్ చేశారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆనకట్టను నిర్మించాలని, లేదా గత జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవోను రద్దు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

అలగనూరు మరమ్మతులతో కేసీ రైతులకు మేలు

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మర మ్మతులతో కేసీ రైతులు క్షామం నుంచి క్షేమం వైపు పయనిస్తారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. 8వ రోజు జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేసీ కెనాల్ రైతుల సమస్యలను ఆయన ప్రస్తావించారు. 92 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న కేసీ కెనాల్ రైతుల ఇరు కారు పంట ఆకాంక్ష నెరవేరేందుకు కేసీ కెనాల్‌కు అనుసంధానంగా సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్య ఉన్న అలగ నూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేస్తే 250 కోట్ల రూపా యల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ఇందుకు కేవలం రూ.36 కోట్లు వెచ్చిస్తే సరిపోతుం దన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమయ్యే నిధులను మంజూరు చేసి కేసీ కెనాల్ రైతులను ఆదుకో వాలని శాసనసభ ద్వారా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



అసెంబ్లీలో రైతు సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

వైవీయూ వలంటీర్లకు అరుదైన అవకాశం





బి.ఈశ్వర్, బి.నవీన్, నీలమహేశ్వరి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపికయ్యారు. బి.ఈశ్వర్ (వైవీయూ), బి.నవీన్ (ప్రభుత్వ డిగ్రీకళాశాల, మైదుకూరు), పి.నీలమహేశ్వరి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కడప) గుజరాత్‌లో జరిగే శిబిరానికి హాజరవుతున్నారు. శిబిరంలో ప్రతిభ కనబరిస్తే 2026 జనవరిలో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కనుంది. ఈసందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పి.పద్మ, సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి, వలంటీర్లను అభినందించారు.

కడప ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం కోర్సుల రెండో విడత ప్రవేశాలకు సెప్టెంబరు 26 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీ.కాం, బీఎస్సీ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెండో విడత వెబ్ ఆప్షన్ల నమోదు సెప్టెంబరు 29న మొదలవుతుందని, విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రాంతీయ జీవనశైలికి ప్రతిరూపంగా భూమిపూజ కథనం



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వేంపల్లె గంగాధర్

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సులో కడప జిల్లా ప్రతినిధి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వేంపల్లె గంగాధర్ పాల్గొన్నారు. శనివారం సాయంత్రం జరిగిన విభిన్న భాషల కథా సదస్సులో రాయలసీమ గ్రామీణ జీవనాన్ని సజీవంగా చిత్రించిన భూమి పూజ కథను ఆయన సమర్పించారు. ఈ కథ ద్వారా ప్రాంతీయ జీవనశైలి, సంస్కృతి, వ్యక్తిత్వాలను స్పష్టంగా ప్రతిబింబింపజేశారు. దేశీయ, అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక ప్రతిభలతో కూడిన ఈ సదస్సు రచయితలు, కళాకారుల మధ్య సృజనాత్మక చర్చలకు వేదికగా మారింది.

నవంబరు 2న జానమద్ది సాహితీ పీఠం పురస్కారాల ప్రదానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త బ్రౌన్‌శాస్త్రి జానమద్ది శతజయంతి సందర్భంగా జానమద్ది సాహితీ పీఠం పురస్కారాల ప్రదానోత్సవం నవంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో జరగనుందని జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్ట్ విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జ్యోతిర్మయి వెంకటప్రతాప్ హాజరవుతారన్నారు. సాయంత్రం అన్నమయ్య కీర్తనల కచేరి, అనంతరం సాహిత్య ప్రసంగాలు జరుగుతాయని తెలిపారు.

సుబ్బిరెడ్డి ఆత్మహత్యకు కారకులైన నిందితులను అరెస్టు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్ అధ్యక్షతన శనివారం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వవిహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీబీపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సత్తార్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు ఓబయ్య మాట్లాడారు. సుబ్బిరెడ్డి ఆత్మహత్య విషయంపై అప్పటి ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చి ఇప్పటికి 50రోజులవుతున్నా ఇంత వరకు దోషులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు సంఘం నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి దేవర శ్రీకృష్ణ, వైహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌ఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

● నెలాఖరులోగా పంట నమోదు పూర్తి కావాలి

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి సతీష్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉద్యాన శాఖ, రాష్ట్ర సూక్ష్మ సాగునీటి పథకం వారి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ లింగాల, వేముల మండలాల్లో పంట నమోదుకు శాతాన్ని ఆర్ఎస్‌కేల వారీగా పరిశీలించారు. కొన్నిచోట్ల పంట నమోదు శాతం తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలలు అవుతున్న పంట నమోదు పూర్తికాకపోవడం ఏమిటని మందలించారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని, పూర్తిచేయాల్సిందే అన్నారు. గైర్హాజరైన వారి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యాన పంటలు నాటుకునే రైతులకు దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు వంటి పంటలకు రాయితీ ఉంటుందన్నారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుకు చేపట్టాల్సిన నివారణ చర్యలను సిబ్బందికి వివరించారు. అనంతరం ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్ అందాలన్నారు. ఆర్ఎస్‌కేల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీతో రూ.2.18 లక్షలు, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18లక్షల వరకు రాయితీ అందజేస్తారన్నారు. 5 నుంచి 10 ఎకరాల పైన ఉన్నరైతు లకు 50శాతం రాయితీతో రూ.4లక్షల వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. డ్రిప్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, వేముల, లింగాల మండలాల ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్

మాదకద్రవ్యాల వినియోగంతో కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం

చెన్నూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను ఎవరు వినియోగించినా వారి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం మాదక ద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే అనర్థాలపై గ్రామ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగంపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఈగల్‌టీం ఏర్పాటు చేసి గంజాయి లాంటి మత్తు పదార్థాలను యువత తీసుకోకుండా పూర్తిస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకోసం సమాజంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం యువత మత్తుపదార్థాలకు బానిస అయితే చేజేతులారా భవిష్యత్తు నాశనం చేసుకున్నట్లేనని తెలిపారు.

ఈనెల 22 నుంచి కేంద్రం జీఎస్టీని తగ్గించిందని, తద్వారా ఎన్నోరకాల వినియోగకరమైన వస్తువులపై ధరలు తగ్గాయన్నారు. ఒకవేళ పూర్వపు ధరలే ఉంటే ఆ విషయం అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్ర మంలో ఏపీయం వెంకటేశ్, సీసీ నారాయణరెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వంది ప్రజలే

● స్థానిక ఎన్నికల్లో కూటమి స్వీప్ చేస్తుంది

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు దుష్ట పాలనతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వైసీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేకుండా చేసింది రాష్ట్ర ప్రజలేనని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ తెలిపారు. హార్సిలీహిల్స్‌లో శనివారం పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జగన్ హయాంలో ముందుచూపు, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం మెప్పు కోసం బటన్లు నొక్కి రాష్ట్రం రూ.లక్ష కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు క్లీన్‌స్వీప్ చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు మెడికల్ కాలేజీల్లో సీట్లు అమ్ముకుని లాభపడాలని చూశారని, ప్రభుత్వం రాకపోయే సరికి పీపీపీ విధానంపై బురద జల్లుతున్నారన్నారు. ప్రస్తుతం తమ భూములను లాక్కుంటారు, స్థలాలను కబ్జా చేస్తారు, అక్రమ కేసులు పెడతారు, వెంచర్లలో వాటాలు అడుగుతారనే భయాలు లేకుండా రైతులు, వ్యాపారులు, ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. టూరిజం అభివృద్ధికి చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారని హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపు జరుగుతుందన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం హజ్‌యాత్ర, దుల్హన్ లాంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. అంతకు ముందు తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాల ముస్లిం మైనార్టీ నేతలు ఆయనకు సాదరస్వాగతం పలికి పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, ఎస్‌ఏ మస్తాన్, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, తంబళ్లపల్లె టీడీపీ నేతలు అయాబ్‌బాషా, సికిందర్ ఆజం, ఎండీ మస్తాన్, సాజిద్ బాష, లతీఫ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హార్సిలీహిల్స్‌లో విలేకరులతో మాట్లాడుతున్న షరీఫ్

సినీ ఫక్కీలో విద్యార్థిని కిడ్నాప్

● పట్టుకున్న పోలీసులు ● నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇంజనీరింగ్ విద్యార్థినిని కారులో బలవంతంగా ఎక్కించుకుని పారిపోయారు. దీంతో ఆ యువతి తల్లి గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న వారు నీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్‌గా, కిడ్నాప్ చేసి యువతిని తీసుకెళ్లిన కారు నెంబరు గుర్తించారు. సీఐ బాలమద్దిలేటి ఇటు వేంపల్లె, కమలాపురం, ఎర్రగుంట్ల పోలీ సులను అలర్ట్ చేశారు. దీంతో ఎర్రగుంట్లలో కిడ్నాపర్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. సీఐ బాలమద్దిలేటి వివరాల మేరకు.. తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన యువతి పులివెందుల రోడ్డులోని ఇంజనీరింగ్ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కావడంతో తన కుమార్తెను తీసుకెళ్లేందుకు కాలేజీ వద్దకు వచ్చింది. తల్లీ కూతు రు ఊరికి వెళ్లేందుకు బస్టాపు వద్ద ఉండగా పవన్‌కళ్యాణ్, అతని సోదరుడు రాజేశ్, అరవింద్, సురేంద్రలతో కలిసి కారు లో అక్కడకి వచ్చారు. ఆ యువతిని బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా తల్లి అడ్డుపడింది. దీంతో వారు ఆమెను కిందకు తోసివేసి కారులో ఎక్కించుకుని పరారీ అయి నట్లు తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు పవన్‌కల్యాణ్, అతని తమ్ముడు రాజేశ్, స్నేహితులు అరవింద్, సురేంద్రలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధికుక్కల దాడి.... 30 మేకపిల్లలు మృతి



మృతి చెందిన మేకపిల్లలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల పంచాయతీ జౌకుపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు దాడి చేయడంతో 30 మేకపిల్లలు మృతి చెందాయి. జాలా ప్రసాద్ అనే వ్యక్తి మేకపిల్లలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వీధికుక్కలు ఒక్కసారిగా మేక పిల్లలపై దాడిచేసి చంపేశాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.-

ఎస్‌జీఎఫ్ అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్)కు బాలబాలికలు ఎంపిక



కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రెండో విడత క్రీడల ఎంపికల్లో భాగంగా శనివారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్) క్రీడాపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో జి.పూజిత, ఎస్.శృతిక, జె.మునీగీతిక, వై.నాగమౌనిక, జీకే సంకీర్తన, స్టాండ్ బైగా వీ.పౌర్ణిమ, సి.రీనా, బాలుర విభాగంలో ఎ.సాయి నవ్‌నీత్ దత్త, సి.త్రివిక్రం, ఎస్.ఇస్మాయిల్, పవన్‌రెడ్డి, అభినవ్, స్టాండ్‌బైగా ఏవీ సాయి సంతోష్, జె.దినేష్‌లు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 19 ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి చంద్రమోహన్‌రాజులు వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య

కడప క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో యువకుడు మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా డోన్‌కు చెంది న మురహరి కుమార్ (35) చిన్న చిన్న కూలీ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావ డంతో మనస్తాపం చెంది శనివారం రిమ్స్ సమీపంలో మాత్రలు వేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



స్మార్ట్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 2వ డివిజన్ దేవుని కడపలో శనివారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీపొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

కడప కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో మిస్సా మూవీ వారి సహకారంతో ఈ నెల 28న, 30న, అక్టోబరు 2న దసరా ఉత్సవాలు కన్నులపండువగా జరగనున్న ట్లు శిల్పారామం పరిపాలనాధికారి క్రిష్ణప్రసాద్ వెల్లడించారు. శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు శిల్పారామాల ఏఈ డి.వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయాన్నారు.

మనకడప-ఘనగడప వీడియో ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రచయిత, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి రచించిన మన కడప -ఘన గడప పాట వీడియోను డీఈవో షంషుద్దీన్ ఆవిష్కరించారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఆధ్యాత్మిక స్థలాలు, దర్శనీయ ప్రదేశాలు, నదులు, ఖనిజ సంపద, కళలు-సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ ఈ పాట రూపొందించారని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, ఉపాధ్యాయ సంఘాల నేతలు లెక్కల జమాల్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష తదితరులు హాజరయ్యారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేషన్ ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్మిక నాయకులు కంచుపాటి తిరుపాల్, ఇత్తడి ప్రకాష్, సుంకరి రవి, సుంకరి కిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న మౌళిక సదుపాయాల కొరత తీర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'డిజిటల్ బుక్ ద్వారా సమస్యలు తెలియజేయండి'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఇబ్బందులను డిజిటల్ బుక్ ద్వారా వెలుగులోకి తీసుకెళ్లాలని వైసీపీ జిల్లా నాయకులు ప్రతినిధులు తెలిపారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, పర్యవేక్షకులు అజయ్‌రెడ్డి, సురేష్‌బాబు, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కడప డివిజన్‌లోని కడప టౌన్, చింతకొమ్మదిన్నె, రిమ్స్, కడప ఈస్ట్ రూరల్, పెండ్లిమర్రి, చెన్నూరు, వల్లూరు, నందిమండలం, ఒంటిమిట్ట, సిద్దవటం సెక్షన్‌లలో విద్యుత్ బిల్లుల కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఎస్పీడీసీఎల్ (ఆపరేషన్) ఈఈ హరిసేవ్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

వృషభాచలేశ్వర ఆలయ చైర్మన్‌గా పీవీ రమణ



వేంపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నదీ ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వర దేవస్థాన చైర్మన్‌గా పీవీ రమణను నిర్ణయించినట్లు టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈనెల 29వ తేదీన పాలక మండలి ప్రమాణస్వీకారంతో పాటు వెంటనే చైర్మన్‌గా రమణను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. పాలక మండలి సభ్యులుగా పీవీ రమణ, మారుతి ప్రసన్న, అద్దంకి రామయ్య, నాగిశెట్టి సునీల్, పెద్దరామాంజ నేయులు, తప్పెట వరాలు, జూటూరు జ్యోతి, కొమ్మద్ది వెంకటసుబ్బమ్మ, కోనేటి రాజమ్మ,ఎక్స్ అఫిషియో సభ్యుడుగా ఆలయ పూజారి హరిప్రవీణ్‌ను నియమించారు.

కరుణించవే.. కాత్యాయనీ...



కడప..లలితా పంచాయతన దేవాలయంలో కోలాటం వేస్తున్న భక్తులు

కడప కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

నగరంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి..: నగరంలో దసరా ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు క్యూకట్టారు. భక్తుల తాకిడికి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

లలితా పంచాయతన దేవాలయంలో..: నగర శివారు ప్రాంత లలితా పంచాయతన దేవాలయం లో అమ్మవారు అరుణ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కళాకారు ల కోలాటం ఆకట్టుకుంది.

విజయదుర్గాదేవి ఆలయంలో..: నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం రాత్రి 8గంటలకు విజయదుర్గా మల్లికార్జునులు ఆలయ ప్రదక్షిణగావించారు.

అమ్మవారిశాలలో..: అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శన మిచ్చారు.

రాజ రాజేశ్వరి ఆలయంలో..: రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవీ అలంకారం భక్తులకు దర్శనమిచ్చారు.

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: నగర గడి బజారు శ్రీలక్ష్మి సత్యనారాయణస్వామి దేవస్థానం లో అమ్మవారు వేంకటేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబ దేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయం లో అమ్మవారు వనదుర్గాదేవి (తోటోత్సవం) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రముక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు మోహినీ దేవి అలంకారంలో,శంకరాపురం ఎస్‌బీఐ సమీపం లో వెలసిన అమ్మవారి ఆలయంలో అమ్మవారు వారాహిదేవిగా, సీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెల సిన శ్రీశక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మ వారుసరస్వతీదేవిఅలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే చిన్నచెన్నవీధిలో వెలసిన బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా, హనుమప్పవీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో అమ్మవారు వారాహిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శంకరాపురంలో వెలసిన అమ్మవారి ఆలయంలో వారాహిదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

చెన్నూరు..: రామలింగ చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారు సంతాన లక్ష్మిగా,వాసవీ కన్యకా పరమేశ్వరిదేవాలయంలో అమ్మవారు గజలక్ష్మీ దేవిగా,తూర్పువీధిలోని మాతమ్మదేవాలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

వల్లూరు..: వల్లూరులో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారం చేపట్టారు.

పెండ్లిమర్రి..: పొలతల మల్లికార్జున స్వామి ఆలయంలో పార్వతీ దేవి అమ్మవారు లలితా మహా సుందరీ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు

సీకేదిన్నె..: బయనపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు ధనలక్ష్మీదేవిగా , గంగమ్మ ఆలయంలో లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

కమలాపురం రూరల్..: అమ్మవారిశాలలో అమ్మవారు శ్రీలక్ష్మి వేంకటేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



విజయదుర్గా అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న అంజద్‌బాషా, దుర్గాప్రసాద్



ఎర్రముక్కపల్లెలో మోహినీదేవి అలంకారంలో అమ్మవారు



చెన్నూరు తూర్పువీధి మాతమ్మ దేవాలయంలో గాయత్రిదేవి అలంకారం,వల్లూరు...అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు, పెండ్లిమర్రి.. పొలతలలో లలితా మహా సుందరీ అలంకరణలో అమ్మవారు, కమలాపురంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



కడప అమ్మవారిశాలలో త్రిపురసుందరీదేవి అలంకారం

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించండి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు,బర్త్ సర్టిఫికెట్ల పంపిణీ

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అల్మాస్‌పేట 38వడివిజన్ యానాది కాలనీలో శని వారం ముఖ్యమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అలాగే బర్త్‌సర్టిఫికెట్లు అందిం చారు.ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యేమాధవి, టీడీపీపొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీనాయకుడు జిలాని బాష, నగర అధ్యక్షులు మన్సూర్‌అలీఖాన్ పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. కాగా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోవ డాన్ని నిరసిస్తూ అక్టోబరు 7వ తేదీన విజయవాడలో చేపట్టే మహాధర్నాలో పాల్గొనాలని రాష్ట్ర ఫ్యాప్టో పరిశీలకుడు మల్లు రఘునాథరెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం వీవీఆర్ ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండీ ఇలియాస్ బాష అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు సయ్యద్ ఇక్బాల్, పి.మహేష్‌బాబు, కె.బాలగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటా పెంచాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ-ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లు పెంచాలని ఏపీ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు.

నేడు గుర్రం జాషువా రచనలపై సదస్సు

కడప కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్రంజాషువా జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం 4గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆయన రచనలపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సాహిత్య అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

11నుంచి మహాసభలు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు అక్టోబరు 11,12వ తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాల యంలో జిల్లా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సులోచనమ్మ, మేరీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ ప్రాంగణాన్ని పార్కుగా ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పాత మున్సిపల్ ఆఫీసు ప్రాంగణాన్ని పార్కుగా ఏర్పాటు చేసి దానికి పర్యాటక పితామహుడు సిద్దవటం సీతారామయ్య పేరు పెట్టాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా శనివారం పాత మున్సిపల్ ఆఫీసులో గల భారత రాజముద్రిక విజయస్థూపం వద్ద ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లవద్దు

చెన్నూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికెళ్లవద్దని సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. చెన్నూరు వెలుగు కార్యాలయంలో శనివారం మాదకద్రవ్యాలు వద్దు, సూపర్ జీఎస్టీ మహిళల భద్రత, పొదుపు వంటి అంశాలపై మహిళలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఏ ఒక్కరు కూడా మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం వెంకటేశు పాల్గొన్నారు.

డ్రగ్స్ అడ్డుకట్టకు సహకరించండి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అడ్డుకట్టకు సహకరించాలని పులివెందుల అర్బన్ సీఐ సీతారామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ సభాభవనం, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్‌సేవింగ్స్, మహిళా భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన అనే అంశాల గురించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, వెలుగు ఏపీఎం గురురాజ్, మెప్మా సీఎంఎం నాగలక్ష్మి,సీసీలు,ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలి - డీఎస్పీ



పులివెందుల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ మత్తుపదార్థాలపై అవగాహన కలిగిఉండాలని పులివెందుల డీఎస్పీ మురళినాయక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం డీఎస్పీ పులివెందుల జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీమురళినాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలాధర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ హాజీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.



కిటకిట..!

కడప మారుతీనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా, జిల్లాయేతర ప్రాంతాలలో ఉన్న వారు సొంత ఊర్లకు బయల్దేరేందుకు వీలుగా శనివారం కడప బస్టాండుకు చేరుకున్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో కడప బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులకు దసరా సెలవులు ఇచ్చారు. శనివారం ఉదయం నుంచే ట్రిపుల్‌ఐటీ నుంచి విద్యార్థులు స్వగ్రామాలకు బయలు దేరారు. దీంతో వీరన్నగట్టుపల్లె సర్కిల్, వేంపల్లెలోని ప్రధాన బస్‌స్టాపులు, బస్టాండ్ విద్యార్థులు వారి తల్లి దండ్రులతో కిటకిటలాడాయి.

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం

చక్రాయపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. దసరా సెలవులు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు.ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వీఐపీ, సర్వదర్శనం, ఆకుపూజలు చేసేందుకు భారీగా క్యూలైన్లలో నిలిచారు. భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాపాఘ్ని నది ప్రవహిస్తుండడంతో పిల్లలు గంటలకొద్ది పాపాఘ్నిలో స్నానాలాచరించి. ఏదిఏమైన శ్రావణ మాసంలో తొలి శనివారంలా భక్తుల రద్దీ కనిపించింది.





ప్రయాణికులతో కిటకిటలాడుతున్న కడప, వేంపల్లి బస్టాండ్లు, చక్రాయపేట.. గండి అంజన్న దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

గజలక్ష్మి.. నమోస్తుతే..!


ప్రొద్దుటూరు వేంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో సంతాన లక్ష్మి


బద్వేలులో అర్ధనారీశ్వరీగా దుర్గాదేవి


మైదుకూరులో భువనేశ్వరిదేవిగా అమ్మవారు


జమ్మలమడుగులో భవానీదేవిగా వాసవీమాత

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గజలక్ష్మి.. నమోస్తుతే..! అంటూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాల, రాజరాజేశ్వరీదేవి ఆలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, శివాలయాల్లో గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రతనాల వేంకటేశ్వరస్వామి అలంకారంలో ధనలక్ష్మీదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శనివారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా పట్టణంలోని శ్రీ మత్కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు భవానీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, కమిటీవారు విశేషపూజలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్లలోని మెయిన్ బజార్ లోని అమ్మవారిశాలలో వాసంబకు శనివారం గజలక్ష్మీదేవి అలంకారం నిర్వహించారు. ఏరు వాకగంగమ్మ పార్వతీదేవి అలంకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరీదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు. మహాఅం కమ్మ ఆలయంలో పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారు గజలక్ష్మీదేవి అలం కారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, పాల్గొని పూజలు చేశారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు అమ్మ వారిశాలలో శనివారం భువనేశ్వరి దేవి అలం కారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు నంద్యాలంపేటలోని యల్లమ్మ తల్లి లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.


కాశినాయనలో: నర్సాపురం లోని లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చా రు. భక్తులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొండాపురంలో: దత్తాపురం పెద్దమ్మగుడిలో ఆరవరోజు శనివారం లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం గాయత్రీదేవి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠంలో: మండల కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో శని వారం ధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వ హిస్తున్నారు.

బద్వేలుటౌన్‌లో : స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు అష్టలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, కనకదుర్గాదేవి అర్ధ నారీశ్వదేవిగా దర్శనమిచ్చారు. కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామ అవతారం, మహాలక్ష్మీదేవి ధాన్యలక్ష్మీవిగా దర్శనమిచ్చారు.


ఎర్రగుంట్ల అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవి


పార్వతీదేవిగా ఏరువాకగంగమ్మ


బి.మఠంలో ధనలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి


కాశినాయనలో గజలక్ష్మిగా అమ్మవారు


ప్రొద్దుటూరు చౌడేశ్వరీదేవి, శివాలయంలో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

నగరవనం పరిశీలన

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అటవీ శాఖ పరిధిలో ఉన్న రామేశ్వరం నగర వనాన్ని అటవీశాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ బీవీసీ క్రిష్ణమూర్తి తనిఖీ చేశారు. శనివారం సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన ఇక్కడకు చేరుకుని అటవీశాఖ అధికారులతో కలిసి ఆర్‌జీఎన్‌పీ, రామేశ్వరం నగరవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటే చర్యలతోపాటు నగరవనంలో డ్రిప్ ఇరిగేషన్, పర్యావరణవిద్య వంటివాటిపై కీలక ఆదేశాలు జారీ చేశారు. డీఎఫ్‌వో వినిత్‌కుమార్, స్క్వాడ్ డీఎఫ్‌వో రాజశేఖర్, సబ్‌డీఎఫ్‌వో సంకేసునీల్‌గరుడు, ఎఫ్‌ఆర్‌వో హేమాంజలి, బీఆర్‌వో లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ క్రిష్ణమూర్తి

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

గోపవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో శనివారం కొత్త స్మార్ట్‌రేషన్ కార్డులను వీఆర్వో జయరాములు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వోతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరికెళ్తే సమాచారమివ్వాలి

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సెలవుల్లో ఊరికెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి కోరారు. దీంతో వారి ఇంటిపై నిఘా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

239 మందికి వైద్య పరీక్షలు

దువ్వూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం 239 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కడప నుంచి వచ్చిన వైద్యులు సుధ, పవన్‌కుమార్, ఖలంధర్, శశిభూషణ్‌తోపాటు స్థానిక వైద్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష

గోపవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే కుటుంబానికి శ్రీరామరక్ష అని డాక్టర్ కె.నాగరాజు అన్నారు.శనివారం స్వశక్తి పరివార్ అభియన్ కార్యక్రమాన్ని శనివారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్టోబరు 2 వరకు మండలంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి డాక్టర్ మల్లేశ్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, మురళీక్రిష్ణ, డాక్టర్లు వెంకటసుమన్ పాల్గొన్నారు.

సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ

మైలవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ ఇస్తున్నట్లు దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం నరసమ్మ తెలిపారు. జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ఒకేషనల్ సమగ్ర శిక్ష ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను జీసీడీవో ఆరోగ్యమేరి, జిల్లా ఒకేషనల్‌కోఆర్డినేటర్ వంశీ, సునీల్ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆమె తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గాయి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన చాలా వస్తువులపై జీఎస్టీ (గూడ్స్ సర్వీస్ టాక్) తగ్గించినందువల్ల వస్తువుల ధరలు భారీగా తగ్గుతాయని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూ టీ కమిషనర్ హనుమంతు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం కమిషనర్ రవిచంద్రా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మెప్మా ఆర్‌పీలు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి జీఎస్టీ తగ్గింపు వలన వస్తువుల పై ధరలు తగ్గి సేవింగ్స్ అయ్యే విషయం పై ప్రజలకు తెలపాలన్నారు. డీఎస్పీ భావన మాట్లాడుతూ యువతను డ్రగ్స్ గంజాయి నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాజనరసింహారెడ్డి మెప్మా సీఎంఎం మహాలక్ష్మీ ఒన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరులో: జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందని ఎంపీడీవో రాధాకృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసరాలు, వాహనాలపై జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సీఐ దస్తగిరి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబులరెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో

బద్వేలుటౌన్‌లో : మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన కల్పించారు. స్వయం సహాయకసంఘాల ద్వారా ప్రజలందరికీ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ పై అవగాహన కల్పించాలన్నారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం

జమ్మలమడుగు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, సీఐటీయూ నాయకులు హరిబాబు, వినయ్‌కుమార్ సూచించారు. శనివారం జమ్మలమడుగులోని షిరిడీసాయి జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. భగత్‌సింగ్ బ్రిటీష్ వారితో పోరాడిన సేవలను గురించి కొనియాడారు. ఈ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మధు, ఖాదర్, దస్తగిరి, బాబయ్య, చరణ్, పవన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎర్రగుంట్ల కమిషనర్ శేషఫణి, సీఐ విశ్వనాథరెడ్డిలు పేర్కొన్నారు. మహిళల భద్రత, మత్తుపదార్థాల నుంచి కాపాడుకోవడం ఎలా అని మహిళలకు అవగాహన కల్పించారు.

బి.కోడూరులో: మండలంలోని గ్రామ సమాఖ్య మహిళలందరికీ మహిళాభద్రత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలనివారణ గురించి వెలుగు ఏపీయం సంజీవరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేలు సర్కిల్ ఇన్‌స్పెక్టరు క్రిష్ణయ్య హాజరయ్యారు. అనంతరం పిల్లలతో కలిసి బి.కోడూరులో ర్యాలీ నిర్వహించారు.

చాపాడులో: ప్రజలు డ్రగ్స్ నేరాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ అన్నారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో శనివారం అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. గంజాయి, హెరాయిన్ వాడితే జీవితాలు నాశనమవుతాయన్నారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి

చాపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త లోమడ మైత్రాదేవి (40) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. 20 ఏళ్ల నుంచి మైత్రాదేవి అంగన్వాడీ కార్యకర్తగా పనిచేశారు. చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ముంతాజ్‌బేగం మైత్రాదేవి మృతదేహాన్ని సందర్శించి ఆమె దహన సంస్కారాలకు మైత్రాదేవి అన్న శ్రీనివాసులరెడ్డికి రూ.15 వేలు నగదు అందజేశారు.